

రైతు సంక్షేమమే ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. 8లో▸



అక్రమ నిర్మాణం..

చట్టాల్లోని లొసుగలతో కొందరు రియల్ వ్యాపారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. 8లో▸

కిరాయి.. లడాయి!

చౌదరిగౌడను మండల కేంద్రంగా ప్రకటించిన తర్వాత ఓ అద్దె భవనంలో ఎంపీడీఓ ఆఫీసును ఏర్పాటు చేశారు. నెలకు రూ.10,940 చొప్పున అద్దె చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. తొమ్మిదేళ్లుగా అద్దె చెల్లించక పోవడంతో భవన యజమాని నాలుగు నెలల క్రితం గేటుకు తాళం వేశాడు.

కొత్తగా మంజూరైన మహేశ్వరం మెడికల్ కాలేజీ కోసం గత ఏడాది మంగళ్‌పల్లి సమీపంలోని ఓ ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. నెలకు రూ.16 లక్షల చొప్పున అద్దె చెల్లించేందుకు అంగీకరించారు. 14 నెలలైనా చెల్లింపులు లేకపోవడంతో భవన యజమాని మూడు నెలల క్రితం గేటుకు తాళం వేశాడు.

మూడేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో తాజాగా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు భవన యజమాని తాళం వేశాడు. ఇలా జిల్లాలో నిత్యం ఏదో ఒక అద్దె భవనానికి తాళాలు పడుతూనే ఉన్నాయి. ఇటు అధికారులు, అటు భవన యజమానులకు మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అయినా ప్రభుత్వం సొంత భవనాలపై దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- రెంటు చెల్లింపులో అలసత్వం
- ఒత్తిడి తెస్తున్న యజమానులు
- చేసేది లేక గేట్లకు తాళాలు
- అధికారులు, యజమానులకు మధ్య తరచూ వివాదాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఉన్నవి సైతం శిథిలావస్థకు చేరుకోవడం, చిన్న వర్షానికే స్లాబ్‌ల నుంచి నీరు లీకవుతుండటం, భవనం పైకప్పులు తరచూ పెచ్చులూడుతుండటం, ఉద్యోగుల నిష్పత్తికి అనుగుణంగా గదులు లేకపోవడం ఇబ్బందిగా మారింది. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అద్దెలు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఖాళీ చేయాల్సిందిగా యజమానులు ఒత్తిడి తీసుకొస్తుండటంతో ఏమీ చే యలేక నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని

- మహేశ్వరం డీసీపీ ఆఫీసు సహా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు హయత్‌నగర్ అబ్కారీ ఠాణాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.
- షాద్‌నగర్ నియోజకవర్గంలోని జిల్లేడుచౌదరిగూడ ఎంపీడీఓ కార్యాలయం సహా నంది గామ తహసీల్దార్ ఆఫీసు, షాద్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.
- చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్, ఆమనగల్లు నియోజకవర్గం కడ్తాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కేజీబీవీ హాస్టల్ అద్దె భవనాల్లోనే కాలం వెల్లదీస్తున్నాయి.
- చేవెళ్ల మండలంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, వ్యవసాయ డివిజన్, మండల కార్యాలయం, పోస్టాఫీస్, ఇరిగేషన్, ఎస్టీఓ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి.

వసతి గృహాలు సైతం

ప్రభుత్వ కార్యాలయాలే కాదు విద్యార్థి వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు సైతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 34 విద్యార్థి వసతి గృహాలు ఉండగా, వీటిలో ఒకటి అద్దె భవనంలో నడుస్తోంది. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 16 పాఠశాల వసతి గృహాలు ఉండగా, వీటిలో రెండు వసతి గృహాలు, 21 కళాశాల వసతి గృహాలు ఉండగా, వీటిలో 20 అద్దె భవనాల్లో ఉన్నాయి. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 202 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కొన్నింటికి సొంత భవనాలను అనువైన భూములు ఉన్నాయి. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లుగా అద్దెల భారం తప్పడం లేదు. నిజానికి ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దెలతో కొత్త భవనాలు కట్టుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి 40 నెలలుగా అద్దె చెల్లించలేదంటూ సదరు యజమాని భవనానికి తాళం వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 17 సంవత్సరాలుగా ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. 40 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో విసుగు చెందిన యజమాని పిట్టల రాజుముదిరాజ్ సోమవారం ఉదయం ఆఫీసుకు తాళాలు వేశారు. తనకు రావాల్సిన అద్దె చెల్లించిన తర్వాతే తీస్తానని తేల్చిచెప్పారు. బ్యాంకు రుణం తీసుకుని, భవనం నిర్మించానని, ఏళ్ల తరబడి అద్దె చెల్లించకపోతే ఈఎంఐలు ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె చెల్లింపు విషయంలో ప్రతీసారి అధికారులు తనను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఆఫీసు పని వేళల్లో సుమారు గంటన్నర పాటు తాళం వేయడంతో ఇటు అధికారులు, అటు ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. స్పందించిన స్థానిక సబ్ రిజిస్ట్రార్ సునీతారాణి పదిహేను రోజుల్లో డబ్బులు చెల్లించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో యజమాని కార్యాలయ తాళాలు తీశారు. తాళాలు వేశారన్న సమాచారం తెలుసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు భవన యజమానిని స్టేషన్‌కు తరలించి, కొద్ది సేపటి తర్వాత వదిలేశారు.



అబ్దుల్లాపూర్‌మెట్ కార్యాలయానికి తాళం వేస్తున్న భవన యజమాని

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్: టీజీడబ్ల్యూఆర్‌ఎస్ (బాలికల) ఆమనగల్లు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వినోల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ తెలుగు, పీజీటీ ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, జేఎల్ బోటనీ, జేఎల్ ఫిజిక్స్‌లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 8న (మంగళవారం) డెమో క్లాసులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సర్టిఫికెట్లు ఒక సెట్ జిరాక్స్ తీసుకొని పీఆర్‌ఆర్ కళాశాల షాబాద్‌లో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 79950 10617 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ వారం రెవెన్యూ శాఖకు సంబంధించి 29, ఇతర శాఖలకు సంబంధించి 33, మొత్తం 62 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్ : తెలంగాణ అత్యంత వెనకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ (టీజీ ఎంబీసీడీసీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు వివిధ నైపుణ్యాలను పెంపొందించడానికి హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాఫ్ట్ స్కిల్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెవెన్యూ బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్‌కాన్ఫిడెన్స్, బిల్డింగ్, మెంటల్ వెల్బింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 21 నుంచి 30 ఏళ్ల వయసు ఉండి, ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులని చెప్పారు. ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలన్నారు. 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్ కార్యాలయంలోని ఎంబీసీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు.

అణగారిన వర్గాలకు అండగా ఉంటాం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అణగారిన వర్గాల ప్రజలకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దండోరా జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమం ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి భూషణ్, నాయకులు ప్రవీణ్, సురేష్, లింగం, వెంకటేశ్, యాదయ్య, దర్శన్, జంగయ్య, సుదర్శన్, సత్యం, దశరథ్, శివ, రాజు, మహేందర్, కృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



లాటరీ ద్వారా రైతులకు ప్లాట్లు కేటాయిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు

ఫార్మా రైతులకు ప్లాట్లు

- లాటరీ ద్వారా కేటాయింపు షురూ
- మొదటి రోజు 60 గజాల లబ్ధిదారులకు..
- ప్రక్రియను ప్రారంభించిన కలెక్టర్

కందుకూరు: వంద శాతం హక్కులతో పారదర్శకంగా ప్రభుత్వం ఫార్మా రైతులకు ప్లాట్లను అందజేస్తోందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో సోమవారం కందుకూరు, యాచారం మండలాలకు చెందిన భూ నిర్వాసితులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. మొదటి రోజు 60 గజాల లబ్ధిదారులు 670 మందికి ప్లాట్లు కేటాయించారు. అక్కడే చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడ ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్రభుత్వమే అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నామన్నారు. ఈ ప్రాంతం నుంచి భవిష్యత్‌లో రేడియల్ రోడ్డు నిర్మాణం జరగనుందని చెప్పారు.

రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే సబితారెడ్డి

లాటరీ ప్రారంభానికి కంటే ముందే స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. తొందరపడి ఎవరూ ప్లాట్లు విక్రయించొద్దని, భవిష్యత్‌లో మంచి లాభం వస్తుందని సూచించారు. అంతకుముందు అక్కడ జరుగుతున్న ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురించి ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు సంకల్పించిందని, దీంతో ఈ ప్రాంతం నాశనమయ్యేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతం అభివృద్ధికి కట్టుబడి ఉండేలా ఫ్యూచర్‌సిటీని ప్రకటించారన్నారు. రైతుల భూముల విలువలు మరింత పెరుగుతాయని, భవిష్యత్‌లో గజం ధర రూ.లక్ష పలుకుతుందన్నారు. 320 అడుగుల రహదారి రానుందన్నారు.

పర్యవేక్షించిన అధికారులు

మొదటి రోజు కుర్మిద్ద, మేడిపల్లి, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, నానక్‌నగర్, పంజగూడ, తాటిపర్తి రెవెన్యూ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 60 గజాల చొప్పున ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. కలెక్టర్ నారాయణరెడ్డితో పాటు ఎఫ్‌సీఏడీఏ కమిషనర్ శశాంక, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, డీపీఓ సురేష్‌మోహన్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, డీసీపీ సునీతరెడ్డి తదితరులు లాటరీ ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు గోపాల్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు 121 గజాల ప్లాట్ల కేటాయింపు

ఫార్మాసిటీ రైతులకు 121 గజాల ప్లాట్ల కేటా యింపు మంగళవారం ఉంటుందని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలోని లేఅవుట్‌లోని ఏటీసీ సెంటర్‌లో ఉదయం 8 గంటల నుంచి లాటరీ ద్వారా ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కుర్మిద్ద, మేడిపల్లి, మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె గ్రామాల రైతులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి, ఆకుల మైలారం, అన్నోజిగూడ, తాడిపర్తి, నానక్‌నగర్ గ్రామాల రైతులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం పూర్తయ్యే వరకు కొనసాగుతుందని తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సమ్మెను జయప్రదం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం: దేశవ్యాప్తంగా బుధవారం జరిగే సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం సోమవారం ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 లేబర్ చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతూ ఉద్యోగ భద్రతకు విఘాతం కలుగుతుందన్నారు. 8 గంటల పనిదినాలను 12 గంటలకు పెంచడం సరికాదన్నారు. కనీస వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉపాధి కూలీలకు 200 రోజులకు పని దినాలు పెంచి రూ.600 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, ప్రజా సంఘాల నాయకులు పగడాల యాదయ్య, చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, కందుకూరి జగన్, సుమలత, కవిత, ప్రకాష్‌కారత్, శంకర్, పి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం: పెండింగ్‌లో ఉన్న రూ.8,700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. ఆరేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగాలు వెళ్లే అవకాశాలకు ఆయా కళాశాలల యాజమన్యాలు అడ్డుపడుతున్నాయని విమర్శించారు. అటు ప్రభుత్వాలు ఇటు విద్యాసంస్థల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తామని మాటల వరకే పరిమితం చేశారన్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అరుణ్, వంశీ, తరంగ్, విప్లవ్, లక్ష్మణ్, చరణ్, అజయ్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ర్యాలీ

ఎనికేపల్లిలో ఉద్రిక్తత

- గోశాల పనులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య భూమిపూజ
- పరిహారం తేల్చకుండా ఎలా చేస్తారని చుట్టుముట్టిన రైతులు
- పనులు చేపట్టేందుకు వెళ్లిన జేసీబీని అడ్డుకున్న వైనం
- లాఠీలకు పనిచెప్పిన పోలీసులు.. ఇద్దరికి స్వల్ప గాయాలు



ఆందోళన చేస్తున్న రైతులు

మొయినాబాద్: గోశాలకు కేటాయించిన ఎనికేపల్లి భూముల వద్ద సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉదయం 7.30 గంటలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్ కుమార్ భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్కడికి చేరుకున్నారు. గోశాల ఏర్పాటుకోసం భూమి పూజ చేశారు. అంతలోనే రైతులు అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. పరిహారం విషయం తేల్చకుండా పనులు ఎలా మొదలు పెడతారని నిలదీశారు. పరిస్థితి చేజారి పోతుందని గమనించిన పోలీసులు వలయంగా ఏర్పడి ఎమ్మెల్యేను కారులో ఎక్కించి అక్కడి నుంచి పంపించారు.

తప్పుదోవ పట్టించారు

అధికారులు, పోలీసులు తమను తప్పుదోవ పట్టించారని రైతులు ఆరోపించారు. ఉదయం 8.30 గంటలకు ఎమ్మెల్యే వచ్చి తమతో మాట్లాడతారని అధికారులు సమాచారం ఇచ్చారని, కానీ 7.30 గంటలకే వచ్చి భూమి పూజ చేశారన్నారు. గ్రామం నుంచి భూముల వద్దకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకున్నారని.. ఎమ్మెల్యే భూమి పూజ పూర్తయిన తరువాత పంపారన్నారు.

లాఠీ ఝులిపించిన పోలీసులు

ఎమ్మెల్యే యాదయ్య వెళ్లిపోయిన తరువాత రైతులు అక్కడే బైఠాయించి ఆందోళన చేశారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో భూములను చదును చేసేందుకు జేసీబీ అక్కడికి రాగా రైతులంతా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు లాఠీలు ఝులిపించారు. లాఠీ దెబ్బలకు ఓ మహిళ చెయ్యికి గాయాలుకాగా, మరొకరికి వీపులో వాతలు వచ్చాయి. రైతులు రాత్రి వరకు అక్కడే బైఠాయించారు.

ఖాళీ భూములు ఇవ్వాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసే గోశాలకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్‌రత్నం అన్నారు. ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. మండలంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయని, రైతులు సాగుచేసుకొనే భూములను తీసుకోవడం సరికాదన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిని ఈ నెల 13న కలసి మాట్లాడటానికి సమయం తీసుకున్నారని.. అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టొద్దని తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భీమేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు రక్షణ కల్పిస్తూ పంపిస్తున్న పోలీసులు

హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌కు సిటీ బస్సు పునరుద్ధరణ

సాక్షి, సిటీబ్యూరో: హకీంపేట్‌లోని తెలంగాణ క్రీడల పాఠశాలకు సిటీబస్సును పునరుద్ధరించారు. ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌లో సిటీబస్ సర్వీసులను గతంలో నిలిపివేశారు. దీంతో స్పోర్ట్స్ స్కూల్ రోయింగ్ విద్యార్థి క్రీడాకారులు ప్రతిరోజు హుస్సేన్‌సాగర్‌కు వచ్చి ప్రాక్టీస్ చేసుకోవడం కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి సిటీ బస్సును పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో బస్సును తిరిగి అందుబాటులోకి తెచ్చారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు స్పోర్ట్స్ స్కూల్ నుంచి ప్రారంభమై హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ రోయింగ్ వద్దకు చేరుకొంటుంది.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మంచాల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.భుజంగరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43.02 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వారిలో 24.85 లక్షల మంది చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికీ వారికి పింఛన్ మంజూరు కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని, దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని, ప్రతి జిల్లాకు టీసీపీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టాలను సవరణ చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా అసెంబ్లీలో ప్రత్యేక చట్టం ఆమోదింప చేయాలన్నారు. తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఇప్పటికే కొనసాగుతోందని గుర్తు చేశారు. తెలంగాణలోనూ అమలు చేయాలని, దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జెర్కొని రాజు, నాయకులు బాలరాజు, మల్లయ్య, గ్యార బాష, యాదమ్మ, దశరథ, దానయ్య, అలివేలు, సత్తయ్య, పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భుజంగరెడ్డి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

కేశంపేట: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫెడరేషన్ మండల అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో మండల పరిధి పాపిరెడ్డిగూడ, వేములనర్వ, కేశంపేట, కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలు, పాపిరెడ్డిగూడ, వేములనర్వ, కేశంపేట, సంతపూర్ గ్రామాల్లోని ఎంపీపీఎస్ పాఠశాలలో సమాఖ్య సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఫెడరేషన్ తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. టీచర్ల సర్దుబాటును ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. బదిలీలతో పాటు పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం తదితర సమస్యలు పేర్కొంటూ.. మండల విద్యాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వినీత్, కోశాధికారి చిన్నరావు, విజయ్, అరుణ్, రవి కుమార్, కేశంపేట క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి తదితరులు పాల్గొన్నారు.



మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

అక్రమంగా మట్టి తరలింపు

కేశంపేట: మండల పరిధి కొత్తపేట గ్రామంలోని పెద్ద చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా కొందరు వ్యక్తులు అక్రమంగా ఫంక్షన్‌హాల్‌కు మట్టిని తరలిస్తున్నారని ఆ గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు.. మట్టి తరలింపును అడ్డుకున్నారు. అక్కడి నుంచి వాహనాలను పంపించారు.

పాత నేరస్తుడి రిమాండ్

గోల్కొండ: దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని రిమాండ్‌కు తరలించారు.సోమవారం గొల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ వివరాలు వెల్లడించారు. అబిడ్స్ కట్టేల మండీకి చెందిన మహ్మద్ ముజాహిద్ ఖురేషి(31) నాంపల్లిలోని ఓ షాపులో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు ఇటీవల చోరీలకు పాల్పడుతుండగా వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. మహారాష్ట్రలో సైతం మహ్మద్ ముజాయిద్ ఖురేషీపై కేసు నమోదై ఉంది. ఈ నెల 1న నయాకీలా గోల్కొండకు చెందిన అమీర్ ఖాతూన్ ఇంట్లో 70 వేల నగదుతో పాటు కొన్ని బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నెల 7న గోల్కొండ జమాలిదర్వాజా అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ ముజాయిద్ ఖురేషీ అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్తుడిగా తేలింది. నయాకీలాలో దొంగతనానికి పాల్పడింది తానే అని అంగీకరించడంతో రూ.70 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: సెకండ్ హ్యాండ్ కార్లు అమ్ముకొని, డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు.. కేసు నమోదు చేశారు. ఆదిబట్ల ఎస్ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. నాగోల్ సమతపూరికాలనీకి చెందిన చొప్పరి శరత్.. మూడేళ్లుగా బొంగ్లూర్ సమీపంలోని మారుతీ షోరూంలో టీం లీడర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షో రూం ఆడిటర్ లేని సమయంలో 10 సెకండ్ హ్యాండ్ కార్లను విక్రయించాడు. కానీ డబ్బులు కంపెనీకి చెల్లించలేదు. పలుమార్లు అడిగినా స్పందన కానరాలేదు. దీంతో సంస్థ హెచ్‌ఆర్ అంజాద్ ఫిర్యాదు మేరకు సోమవారం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. గతంలో ఇలాగే కార్లు అమ్మి, విషయం బయటకు పొక్కకుండా.. సంస్థలో పనిచేసే పెద్దలకు నగదు ఇచ్చాడని, అందుకే వ్యవహారం బయటకు రాలేదని తెలిసింది.

వైన్‌షాపు క్యాషియర్‌పై బీరు సీసాతో దాడి

బంజారాహిల్స్: మద్యం బాటిల్‌ను ఎంఆర్‌పీ రేటు కంటే అదనపు డబ్బులు తీసుకుని విక్రయించారనే కోపంతో వైన్‌షాపు క్యాషియర్ మెడపై బీరు సీసాతో దాడి చేసిన ఘటనలో ఇద్దరు మందుబాబులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–36లోని ఎస్వీ వైన్స్‌కు ఫిలింనగర్‌లో నివసించే డ్రైవర్ జగదీష్‌తో పాటు స్నేహితుడు సత్యనారాయణ మద్యం కోసం వచ్చాడు. సిగ్నేచర్ విస్కీ బాటిల్‌ను కొనుగోలు చేసి రూ.1360 చెల్లించాడు. అయితే బాటిల్‌పై మాత్రం దీని ధర రూ.1320 మాత్రమే ఉంది. ఇద్దరూ కలిసి ఫుల్‌బాటిల్ తాగిన అనంతరం మద్యం మత్తులో వైన్‌షాపుకు వచ్చి తమ వద్ద అదనంగా రూ.40లు ఎందుకు తీసుకున్నావంటూ క్యాషియర్ భరత్‌ను అడిగారు. ధరలు పెరిగాయని భరత్ చెప్పగా అప్పటికే మద్యం మత్తులో ఉన్న జగదీష్ అక్కడ ఉన్న బీరు సీసాను పగులగొట్టి భరత్ తలపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితుడిని ఆస్పత్రిలో చేర్పగా మెడపై 24 కుట్లు పడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేసిన జగదీష్‌తో పాటు సహకరించిన సత్యనారాయణను అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణం.. సక్రమ నంబర్లు

అనుమతుల్లేకుండా వెలుస్తున్న కట్టడాలు

- కొలువుదీరుతున్న పరిశ్రమలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికార యంత్రాంగం!



కొత్తూరులో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన షెడ్డు(ఫైల్)

కొత్తూరు: చట్టాల్లోని లొసుగలతో కొందరు రియల్ వ్యాపారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. యథేచ్ఛగా అక్రమంగా భారీ భవనాలు, పరిశ్రమలు నిర్మిస్తూ కోట్లాది రూపాయాలు కొల్లగొడుతున్నారు. అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అరికట్టాల్సిన అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. తీరా నిర్మాణాలు పూర్తయిన తరువాత సక్రమమని పేర్కొంటూ.. ఇంటి నంబర్లు కేటాయిస్తూ.. పరోక్షంగా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు.

అధికారుల కళ్లెదుటే..

కొత్తూరు మున్సిపాలిటీలో నివాస గృహాల నిర్మాణాల కోసం ఏర్పాటు చేసిన ప్లాట్లలో ఇటీవల కొందరు షెడ్లను నిర్మించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా అన్ని అనుమతులు పొందాలి. లేదంటే మున్సిపల్ సిబ్బంది సదరు నిర్మాణాలకు నోటీసు జారీ చేసి, పనులను నిలిపివేస్తారు. కాగా దీనికి భిన్నంగా పురపాలికలో అధికారుల కళ్లెదుటే అక్రమ నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. ముడుపులు, పెద్దల ఒత్తిళ్ల కారణంగా అక్రమ నిర్మాణాల పట్ల అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. తీరా నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఇంటి నంబర్లు కేటాయిస్తు, పరోక్షంగా వారికే సహకరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

నగరం నుంచి శివార్లకు

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో భాగంగా పట్టణం సమీపంలో కొనసాగుతున్న కాలుష్య కారక పరిశ్రమలను అక్కడి నుంచి తరలించాలని నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు నగర శివారులోని కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ ప్రాంతాల్లో రెండు నుంచి పదెకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తూ.. కర్మాగారాలను నెలకొల్పుతున్నారు.

మోసాలు.. రకాలు

- కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారు.. కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను సాగుయేతర భూమిగా మార్చుకోవాలి. అందుకు ప్రభుత్వం నిర్ణయించిన పన్ను చెల్లించాలి. కానీ సదరు యజమానులు.. పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. పదెకరాల స్థలానికి కేవలం రెండుమూడు ఎకరాలను మాత్రమే వ్యవసాయేతర భూమిగా మార్చుకుంటున్నారు.
- పరిశ్రమల ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ, గ్రామ పంచాయతీతో పాటు అన్ని శాఖల నుంచి అనుమతి పొందాలి. ఇక్కడ మాత్రం కేవలం బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందేందుకు వీలుగా ఉన్న అనుమతులను పొందుతున్నారు.
- పరిశ్రమల నిర్మాణాలకు సంబంధించిన పత్రాలను పంచాయతీకి అందజేయాలి. దాని ఆధారంగా ఏటా పన్నులు వసూలు చేస్తారు. కానీ నిర్వాహకులు మాత్రం పూర్తిస్థాయి పత్రాలను ఇవ్వడం లేదు. దీంతో పన్నులు తక్కువగా వసూలు అయ్యే అవకాశం ఉంది.
- అప్పటికే కొనసాగుతున్న పరిశ్రమల్లో తదుపరి అవసరాల కోసం కొత్తగా చేపట్టే నిర్మాణాలకు అనుమతి తీసుకునేందుకు వ్యాపారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.
- షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలు.. తాము టీఎస్ ఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్నాం. అన్ని అనుమతులు ఉన్నాయని ప్రకటిస్తున్నప్పటికీ.. గేటు బయట పరిశ్రమల పేర్లను మాత్రం నమోదు చేయడం లేదు.

చిన్నవారిపైనే పెత్తనం

ప్రభుత్వ అనుమతులు లేకుండా చిన్న షెడ్డును నిర్మించిన వారిపై చర్యలు తీసుకునే అధికారులు.. ఏకంగా పరిశ్రమలను నెలకొలిపి, అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న గోదాములు, పరిశ్రమలు, ఇప్పటికే కొనసాగుతున్న వాటి వివరాలు అధికారులకు తెలుసు. అయినా.. వాటిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారని విమర్శిస్తున్నారు.

చర్యలు తప్పవు



మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ఆర్థికంగా నష్టపోవద్దు. విచారణలో అక్రమం అని తేలితే చర్యలు తప్పవు. ఇప్పటికే పర్మిషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశాం. గడువులోగా స్పందించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా నిర్మించిన వాటికి నంబర్లు కేటాయించినప్పటికీ.. అధిక పన్నులు వసూలు చేస్తాం.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధి చేగూరులో పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో సోమవారం పీఏసీఎస్ భవన నిర్మాణ పనులకు ముఖ్య అతిథిలుగా పాల్గొన్న విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.50 లక్షల వ్యయంతో గోదాంలను నిర్మించామని తెలిపారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు కావాల్సిన రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం పావలా వడ్డీకే పంట రుణాలు ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని, కనీసం రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. లేదంటే రూపాయి పావలా వడ్డీ చెల్లించాల్సి వస్తుందని వివరించారు. వీటితో పాటు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో చైర్మన్ గొర్లపల్లి అశోక్, వైస్ చైర్మన్ పద్మారావు, డైరెక్టర్లు నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, నాయకులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, కావలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చాదర్‌ఘాట్: లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ. 5వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పు ఇచ్చింది. చాదర్‌ఘాట్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్‌మలక్‌పేటలో నివసించే జనపాల అఖిల్ కార్ వాషర్‌గా పని చేసేవాడు. ప్రేమ పేరుతో ఓ బాలికను నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో ఆమె తల్లి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి

బాలానగర్: బిల్డింగ్ పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డినగర్‌లో నిర్మిస్తున్న బిల్డింగ్‌లో రాజ్‌కుమార్ (43) అనే వ్యక్తి మేస్త్రి పని చేస్తున్నాడు. సోమవారం రెండో అంతస్తులో సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: భర్తతో గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన రుబీనా (24) ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి ముగ్గురు సంతానం. ఆదివారం రాత్రి భర్తతో గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన రుబీనా అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజామున దీనిని గుర్తించిన ఆమె భర్త రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాలరు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ



వైన్‌షాపు గోడకు రంధ్రం పెట్టిన దొంగలు

చేవెళ్ల: మద్యం దుకాణానికి దొంగలు కన్నం వేశారు. రూ.4.38 లక్షలకు అపహరించారు. ఈ సంఘటన షాబాద్ చౌరస్తా సమీపంలోని వైన్‌షాపులో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహ వైన్‌షాపులో నంద్యాల రాజేందర్ రెడ్డి క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం షాపు మూసే సమయానికి రూ.3లక్షల 8వేలు, పక్కనే కూల్‌పాయింట్ నిర్వహించే శ్రీశైలం ఇచ్చిన అద్దె రూ.1.30 లక్షలు మొత్తం రూ.4లక్షల 38వేలను రాత్రి షాపులో పెట్టి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం దుకాణానికి వచ్చి చూసే సరికి.. వెనుకభాగంలో గోడకు రంధ్రం చేసి ఉంది. అనుమానం వచ్చి షాపులోని డ్రాను చూడగా అందులోని డబ్బులు కనిపించలేదు. దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. అర్ధరాత్రి 2 గంటలు దాటిన తరువాత ముగ్గురు వ్యక్తులు.. మాస్కులు ధరించి షాపు లో చొరబడి నగదు కాజేసినట్లు రికార్డు అయింది. వెంటనే యజమానికి సమాచారం చేరవేసి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాపు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం..మహ్మద్ తాఫిక్ తన కుటుంబంతో కలిసి ఆసిఫ్‌నగర్ సాబేర్‌నగర్‌లో నివసిస్తూ వంట పని చేస్తాడు. ఇతని కుమారుడు మహ్మద్ దావూద్(20) గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో పనిచేస్తాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు తన బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు స్థానికులు సహాయంతో కిందికి దించి పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు ఘట నా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమో దు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థుల ఆకలి కేకలు!

- మైల్వార్ ప్రాథమిక పాఠశాలలో అందని మధ్యాహ్న భోజనం
- ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని నిర్వాహకుల నిరసన
- పస్తులతో అవస్థలు పడిన 150 మంది చిన్నారులు



మైల్వార్ ప్రాథమిక పాఠశాల



బడిలో పస్తులతో విద్యార్థులు

బషీరాబాద్: మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. మండల పరిధిలోని మైల్వార్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5 తరగతుల వరకు 150 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు భువనేశ్వరీ, ప్రమీళ, సంగీత వీరికి నిత్యం మిడ్ డే మీల్స్ వండిపెట్టేవారు. సోమవారం మధ్యాహ్నం లంచ్ బెల్ కొట్టగానే విద్యార్థులు రోజూ మాదిరిగానే ప్లేట్లు పట్టుకుని బయటకు వచ్చారు. ఈ సమయంలో.. 'బిల్లులు రావడం లేదని ఏజెన్సీ వాళ్లు వంట చేయలేదు. మీరంతా ఇళ్లకు వెళ్లి తిని రావాలి' అని ఉపాధ్యాయులు చెప్పారు. అప్పటికే ఆకలితో అలమటిస్తున్న చిన్నారులు ఇళ్లకు పరుగులు తీశారు. కొంతమంది భోజనం చేసి రాగా, ఇళ్లకు తాళాలు వేసి పొలం పనులకు వెళ్లిన వారి పిల్లలు కడుపు మంటతోనే తిరిగొచ్చారు. సాయంత్రం వరకూ ఆకలితోనే అలమటించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులను నిలదీశారు. వంట వండటం లేదని ముందే చెబితే తాము టిఫిన్లు కట్టి పంపించే వాళ్లమని హెచ్‌ఎం వెంకటప్పపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ విషయాన్ని తాను ఎంఈఓకు చెప్పగా ఏజెన్సీ వాళ్లకు నచ్చజెప్పాలని సూచించారని, నిర్వాహకులు మాత్రం వినలేదని తెలిపారు.

ఇంటికి వెళ్లి అన్నం తిన్నా



ఉదయం పూట కొద్దిగా తిని రోజూ మాదిరిగానే స్కూల్‌కు వెళ్లాం. మధ్యాహ్నం లంచ్ బెల్ కొట్టగానే ప్లేట్ తీసుకొని వెళ్లాం. వంటవాళ్లు ఈ రోజు భోజనం బంద్ పెట్టారు.. మీ ఇంటికి వెళ్లి తిని రండి అని మాసార్లు చెప్పడంతో వెళ్లి తినివచ్చా.

– లావణ్య, 4వ తరగతి

తాళం వేసి ఉంది



మధ్యాహ్న భోజనం వండటం లేదని మాకు తెలియదు. లంచ్ బెల్ కాగానే బయటకు వెళ్లాం. బడిలో అన్నం వండ లేదని, ఇంటికి వెళ్లి తిని రమ్మని చెప్పారు. కానీ ఇంటికి వెళ్లే సరికి తాళం వేసి ఉంది. దీంతో తినకుండానే బడికి వచ్చేశా.

– శశాంక్, 5వ తరగతి